## క్లుప్తంగా

### డీఈలకు సన్మానం



జనగామ: జిల్లా ఎన్పీడీసీఎల్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న డీఈ ఎం.ప్రభావతి ఇటీవల బదిలీ కాగా, ఆమె స్థానంలో జి.గణేశ్, ఏడీ కె.సత్యమయ్య వచ్చారు. మంగళవారం సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఎస్ఈ వేణు మాధవ్ ఆధ్వర్యంలో ప్రభావతికి వీడ్కోలు పలికి ఇద్దరు అధికారులకు స్వాగతం పలికారు.

### పద్మశాలీల హర్షం

చిల్పూరు: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వల్లకాటి రాజ్‌కుమార్ భారీ మెజారిటీతో గెలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని చిన్నపెండ్యాలలో మంగళవారం సంఘం నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా పేల్చిన అనంతరం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వేముల బాలరాజు, దొంత విజయ్, రాజమల్ల, శ్రీధర్, బండారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### త్వరలో అందుబాటులోకి ఎక్స్‌రే మిషన్

సాక్షి ఎఫెక్ట్..

పాలకుర్తి: పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో 'నిరుపయోగంగా ఎక్స్‌రే మిషన్' శీర్షికన మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఎంహెచ్‌ఓ రవీందర్ స్పందించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో టెక్నీషియన్లు లేక ఎక్స్‌రే మిషన్లు నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. త్వరలో ప్రభుత్వం టెక్నీషియన్ పోస్టులను భర్తీ చేస్తే ఎక్స్‌రే మిషన్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

### 'దేవాదుల' ద్వారా నీటి విడుదల

పాలకుర్తి: రైతుల పంటలు ఎండిపోకుండా దేవాదుల ద్వారా నీటి విడుదలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాటుపడ్డారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాల్వల్లో అడ్డుగా వున్న చెట్లు, మట్టిని తొలగించి దేవరుప్పుల, పాలకుర్తి మండలాలకు ఎమ్మెల్యే సాగు నీటిని తీసుకొచ్చారని చెప్పారు. కుమారస్వామి, రాఘవరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జనగామ: జనగామ మండలంలోని నర్మెట ప్రధాన రహదారి గానుగుపహాడ్ జంక్షన్ వద్ద మంగళవారం కారు–బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. గానుగుపహాడ్ గ్రామానికి చెందిన విద్యార్థి కార్తీక్, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న సాయికుమార్ ద్విచక్రవాహనంపై జనగామకు బయలుదేరారు. జంక్షన్‌వద్దకు రాగానే నర్మెట వైపు వెళ్తున్న కారు–బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, సాయి కుమార్‌ను హైదరాబాద్‌కు డాక్టర్లు రెఫర్ చేశారు.

### కోతుల దాడిలో టీచర్, మాజీ సర్పంచ్‌కు ..



బచ్చన్నపేట: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు ఎ.సుజాతపై కోతులు దాడి చేయగా గాయపడిన సంఘటన మంగళవారం జరిగింది. టీచర్ సుజాత పాఠశాలలో డ్రిల్ సమయంలో బయటకు వెళ్లి వస్తున్న క్రమంలో చెట్లపై ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో సుజాత కింద పడటంతో చేయి విరిగి గాయాలయ్యాయి. గమనించిన తోటి ఉపాధ్యాయులు కోతులను వెళ్లగొట్టారు. గాయపడిన టీచర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అలాగే బండనాగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మానెపల్లి యాదయ్య ఇంటి వెనుకాల చెట్టుపై కోతులను వెళ్లకొట్టే క్రమంలో అవి దాడి చేయడగా చేతికి గాయాలయ్యాయి. అధికారులు కోతుల బెడద నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

### మద్యం తీసుకొస్తున్న ఆటోపై గ్రామస్తుల దాడి

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామంలో బెల్టు షాపులకు మద్యం బాటిళ్లు, బీర్లు తీసుకువస్తున్న ఆటోపై గ్రామస్తులు దాడికి దిగిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. మంగళవారం సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఇటీవల లింగంపల్లిలో మద్యపాన నిషేధాన్ని విధించారు. దీంతో గ్రామ ప్రజలు పక్కనే ఉన్న పడమటికేశ్వాపూర్ గ్రామానికి వెళ్లి మద్యం తాగి వెళ్తున్నారు. కాగా, బెల్ట్ షాపుల్లో మద్యం అధిక ధరలకు విక్రయిస్తుండటంతో మండల కేంద్రంలోని వైన్‌షాపు వారు మద్యాన్ని ఆటోలో సరఫరా చేస్తుండగా గ్రామస్తులు పడమటికేశ్వాపూర్ వద్ద దాడి చేసి 11 కాటన్ల మద్యంను ధ్వంసం చేశారు. అలాగే కొందరు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. దాడి విషయమై వైన్ షాపు యజమానులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, నడిరోడ్డుపై ఉరి తీయాలని కుంగ్ ఫూ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కరాటే మాస్టర్ పెసరు సారయ్య డిమాండ్ చేశారు. డాక్టర్ మోహితను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఘన్‌పూర్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో మంగళవారం ర్యాలీ చేపట్టారు. వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి స్థానిక శివాజీ చౌక్ నుంచి గాంధీ చౌరస్తా మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కరాటే మాస్టర్ సారయ్య మాట్లాడారు. కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ను కొంతమంది దుండగులు అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేసి అత్యాచారం, హత్య చేయడం అమానుషమన్నారు. సభ్య సమాజం తలదించుకునే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, చట్టాలను మరింత పటిష్టం చేయాలని, నిందితులను బహిరంగంగా ఉరితీయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరాటే మాస్టర్లు వంగ శ్రీనివాస్, పాదల రాజేష్, శివ, మహ్మద్ జావీద్, ఆర్ఎంపీ వైద్యులు డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, బుయ్య గట్టయ్య, హేమంత్‌రాజ్, విద్యార్థి సంఘాల నాయకులు కె.శరత్‌కుమార్, రహ్మతుల్లా, యూనస్, చింత జగదీష్, రాజేష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, కరాటే మాస్టర్లు

**మహిళల రక్షణకు చట్టాలు చేయాలి**

దేశంలో బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం కఠినతరమైన చట్టాలు చేయాలని దళిత సంఘాల రాష్ట్ర నాయకుడు కలకోల యాదగిరి అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య ఘటన దారుణమన్నారు. నిందితులైన మానవమృగాలను బహిరంగంగా ఉరితీయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో మహిళలకు సరైన రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై చేయి వేయాలంటేనే భయపడేలా చట్టాలు ఉండాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డమీది వెంకటస్వామి, చింత దేవదాసు, పాదల రవి, తాటికొండ కుమార్, చింత అంజి, మల్లేష్, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యత పాటించండి



పాఠశాలలో పనులపై ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చేపట్టిన పనులను సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పెద్ద రామచర్ల మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో జరుగుతున్న పెయింటింగ్ పనులను తనిఖీ చేశారు. చిత్రాలు ఆకర్షణీయంగా ఆకట్టుకునేలా ఉండాలన్నారు. డీఈఓ రామ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, సీడీపీఓ రమాదేవి పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం..

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లిలో సబ్‌స్టేషన్ ఉన్నా.. తరుచూ విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఇటీవల గ్రామస్తులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మంగళవారం డిస్కం డీఈ లక్ష్మీనారాయణరెడ్డి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యుత్ అంతరాయాలపై ఆరా తీశారు. గ్రామస్తులు పాల్గొని విద్యుత్ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సమస్యలపై ఏఈ రాహుల్, సిబ్బందితో డీఈ చర్చించారు. విద్యుత్ సరఫరా అయ్యే ఫీడర్లపై భారం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని డీఈ ఆదేశించారు. ఏఈ రాహులు, మాజీ ఎంపీటీసీ వెంకటనర్సయ్య, నాయకులు రాపోలు రామ్మూర్తి, ఓరుగంటి మనోహర్, బాలపురి రాజేందర్, పృథ్వి, కుమార్, హరీష్, అనిల్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న విద్యుత్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి

# లేబర్ కార్డు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కుమార్

నర్మెట: ఎలక్ట్రీషియన్ పని చేస్తున్న వారందరూ తప్పకుండా లేబర్ కార్డులను కలిగి ఉండాలని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఇట్టబోయిన కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కొలిపాక స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రీషియన్స్ అందరూ ఐక్యమత్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బండి రాజేష్, నాయకులు టీకులపల్లి రాములు, జాటోత్ రాజన్న, గద్దల సల్మాన్, మార్క్ రాజబాబు, రాజబోయిన మల్లేష్, అల్లిబిల్లి సిద్దులు, హరీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల భక్తమార్కండేయ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కోసం గ్రామ అర్చకుడు ఎల్లంభట్ల కరుణాకర్ శర్మ రూ. 2.16 లక్షలు విరాళం ప్రకటించారని పద్మశాలి సంఘం బాధ్యులు పేరాల రాజమౌళి, బత్తుల రాజన్‌బాబు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం కరుణాకర్‌శర్మ మొదటి విడతగా రూ. 1.50 లక్షలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పేరాల చంద్రమౌళి, కుమారస్వామి, మంద రాజమౌళి, రాంబాబు, ఐలోని, రఘునాద్, రాజు, యుగందర్, నారాయణ పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి



బచ్చన్నపేట: నివాళులర్పిస్తున్న నాయకులు



కొడకండ్లలో..



పాలకుర్తిలో..

సాక్షి నెట్‌వర్క్: దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం కోసం మాజీ ప్రధాని, స్వర్గీయ రాజీవ్ గాంధీ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని పలు మండలాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించి ఆస్పత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు.

## డ్రెయినేజీ నీరంతా రోడ్లపైకి..



సెయింట్ మేరీస్ స్కూల్ వెనక అధ్వానంగా ఉన్న నాలా, పక్కనే రోడ్డుపై మురికి నీరు

జనగామ: పట్టణం దుర్గంధ భరితంగా మారింది. రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికే పలు కాలనీల్లో నీరు నిల్వగా..డ్రెయినేజీ నీరంతా రోడ్లపైకి చేరింది. బాలాజీనగర్, కుర్మవాడ తదితర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, హనుమకొండ ప్రధాన రహదారిపై మురికి నీటి సిల్ట్ పేరుకుపోవడంతో కంపు కొడుతోంది. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రైతులందరికీ రుణమాఫీ చేయాలి



జఫర్‌గఢ్: నిరసన తెలుపుతున్న బాధిత రైతులు

జఫర్‌గఢ్: రైతులందరికి రుణమాఫీ చేయాలని కోరుతూ మండలంలోని కూనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బాధిత రైతులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీలో తమ గ్రామానికి చెందిన రైతుల పేర్లు లేవన్నారు. ఇదే విషయాన్ని సంబంధిత వ్యవసాయ అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. షరతులు పెట్టడంతో అర్హులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదన్నారు. బాధిత రైతులు పాల్గొన్నారు.

**వినతుల స్వీకరణ**

రుణ మాఫీ కాని రైతుల నుంచి స్థానిక రైతు వేదిక వద్ద సంబంధిత ఏఈఓలు శిరీష, ప్రశాంత్ వినతులు స్వీకరించారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. రూ.2 లక్షలకు పైన రుణం ఉన్న రైతుల నుంచి వినతులు స్వీకరించకపోవడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన వెంటనే స్వీకరిస్తామని ఏఈఓలు తెలుపడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

**రుణమాఫీకి వెల్లువెత్తిన వినతులు**

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల నుంచి మండల వ్యవసాయాధికారులు రుణమాఫీ కోసం వినతులు స్వీకరించారు. రుణమాఫీ కాని రైతులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో రైతు వేదిక కిక్కిరిసిపోయింది. మొదటి రోజు మొత్తం 71 వినతులు వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను ఏఈఓలకు అందజేయాలన్నారు. రూ. 2 లక్షల పైబడి రుణం ఉన్న రైతులు ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తే రుణమాఫీ జరుగుతుందని, దీనిపై ఆదేశాలు రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు ఉన్నారు.

**127 వినతుల స్వీకరణ**

పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండలంలో రుణ మాఫీ కాని రైతుల నుంచి 127 వినతులు స్వీకరించినట్లు ప్రత్యేక అధికారి, ఏడీఏ పరశురామ్ తెలిపారు. పాలకుర్తిలో రైతు వేదిక వద్ద నిర్వహించిన సమావేశంలో రైతుల నుంచి వినతులు స్వీకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

# డెంగీ నివారణకు చర్యలు చేపట్టాలి

బచ్చన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో డెంగీ వ్యాధి ప్రబలుతున్నందున నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మండల వైద్యాధికారి సృజన అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రశాంత్ ఆచార్య, బృంగి రూపాచైతన్య భరత్‌కిషోర్, సౌజన్య, కర్ణాకర్, దేవీ ప్రసాద్, రాజశేఖర్, రాధాకృష్ణ, నరేష్, సతీష్, రాజీవ్, అనిల్‌రాజ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, పాఠశాల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సృజన

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో పనిచేయాలని ఎంపీడీఓ మధుసూదన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ హాస్టళ్ల వార్డెన్లు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యపై పంచాయతీ అధికారులు ప్రత్యేక చొరవతో పనిచేయాలని, దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ మండల నోడల్ అధికారి కొమురయ్య, వైద్యులు డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జనార్దన్, స్టేషన్‌ఘన్‌పూర్, తాటికొండ, ఇప్పగూడెం పీహెచ్‌సీల వైద్యులు, పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌డబ్ల్యూఓలు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కాని రైతులకు అండగా ఉంటాం..

లింగాలఘణపురం: రుణమాఫీ కాని రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకూ పోరాడుతామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏపీజీవీ బ్యాంకులో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో ఎంత మంది రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు, ఎందరికి రుణమాఫీ అయ్యింది, మాఫీ కాని రైతుల పరిస్థితి ఏమిటని అదనపు కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. ఆయన వెంట సింధు, భాగ్యలక్ష్మి, వీరయ్య, లింగాల వెంకటేశ్, రైతుల తోపాటు తదితరులు ఉన్నారు.

**విషజ్వరాల నివారణకు చర్యలు చేపట్టాలి**



రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న విషజ్వరాల నివారణకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన శీల విక్రమ్ డెంగీ జ్వరంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియల్లో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## క్రీడలతో ఉజ్వల భవిష్యత్

రఘునాథపల్లి: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, యువత క్రీడల్లో రాణించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి అధ్యక్షుడు కందుల అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 320 ఎఫ్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ లవకుమార్ జన్మదినోత్సవం సందర్భంగా క్రీడాకారులకు క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రదీప్, రాజుగౌడ్, లక్ష్మణ్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**టిప్పర్ లారీలను అడ్డుకున్న గ్రామస్తులు**

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం శివారు ఏనె నుంచి అక్రమంగా ఓవర్‌లోడ్‌తో మొరం తరలిస్తున్న మూడు టిప్పర్ లారీలను గ్రామస్తులు అడ్డగించి స్థానిక పోలీసులకు సమాచారం అందించిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామశివారులోని ఏనె నుంచి ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ లారీల్లో మొరంను తరలిస్తుండగా గ్రామంలోని బీటీ రోడ్డు ధ్వంసమవుతోంది. ఈ విషయమై పలుమార్లు గ్రామస్తులు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దాంతో ఓపిక నశించిన గ్రామస్తులు మంగళవారం మొరంతో వెళ్తున్న టిప్పర్‌లారీలను అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు టిప్పర్‌లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ జి.వేణు తెలిపారు. మొరం లోడ్ లారీలను సంబంధిత మైనింగ్ అధికారులకు అప్పగిస్తామని, గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

**భక్తిశ్రద్ధలతో గోపూజ**

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం వాసవీమాత వార్షికోత్సవం సందర్భంగా భక్తిశ్రద్ధలతో గోపూజ చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ లగిశెట్టి భిక్షపతి–బాలమణి దంపతులు వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు మహాన్నదానం చేశారు.

**సమస్యలు పరిష్కరించండి**

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని మోడల్‌కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహరి సానుకూలంగా స్పందించి త్వరలో మోడల్‌కాలనీని సందర్శించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపినట్లు వారు చెప్పారు. కాలనీవాసులు అంజయ్య, యాకుబ్‌పాషా, రాజు, వినయ్, సుందర్‌సింగ్, ఆంజనేయులు, గట్టయ్య, మీనాచారి, తిరుపతి, బాలు, యాకయ్య పాల్గొన్నారు.

**ప్రమాదాల నివారణకు సహకరించాలి**

చిల్పూరు: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ కోరారు. మండలంలోని చిన్నపెండ్యాల బస్టాప్ సమీపంలోని జాతీయ రహదారిపై ఇటీవల వరుస ప్రమాదాలు జరుగుతుండగా మంగళవారం నేషనల్ సేఫ్టీ అధికారులతో కలిసి పరిశీలించారు. చిన్నపెండ్యాల నుంచి వంగాలపల్లి వరకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాల వేగం తగ్గించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రయాణికులు జాతీయ రహదారి దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్సై విజయ్‌కుమార్, చారి, మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి ఉన్నారు.

**కొత్తపల్లి సీఏపై ఫిర్యాదు**

లింగాలఘణపురం: మండలంలోని కొత్తపల్లి గ్రామ మహిళా సంఘాలకు సీఏగా పని చేస్తున్న దాసరి బాబు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నాడని మంగళవారం అదే గ్రామానికి చెందిన జనగామ యాదగిరి ఏపీఎం శంకరయ్యకు ఫిర్యాదు చేశాడు. స్త్రీనిధి డబ్బుల చెల్లింపులో ఆన్‌లైన్‌లో జమ చేయడం తెలియక మహిళలు ఇబ్బంది పడుతుంటే సీఏగా ఉన్న బాబు వారికి సరిగా వివరించకుండా దురుసుగా మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**'రుణ మాఫీ'పై బీఆర్ఎస్ ఆందోళన**

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రుణ మాఫీ చేయడం లేదని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. అనంతరం రైతు వేదికలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుస్కూరి శ్రీనివాస్‌రావు, నల్లా నాగిరెడ్డి, మాచర్ల ఎల్లయ్య, బొబ్బాల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అష్టదళ పాద పద్మారాధన పూజ**

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మాస మంగళవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల సహకారంతో అష్టదళ పాద పద్మారాధన పూజ చేశారు. కార్యక్రమంలో ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, వసంత, స్వరూప, మహేష్, హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్ పాల్గొన్నారు.

**రజకుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి**



పాలకుర్తి: రజకుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మదార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో రజకులపై సాంఘిక బహిష్కరణను వెంటనే ఎత్తేయాలని కోరుతూ మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మదార్ మాట్లాడుతూ.. సాంఘిక బహిష్కరణకు పాల్పడిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

**'కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు'**

దేవరుప్పుల: సీఎం కేసీఆర్ హయాంలో పంట రుణమాఫీలో ఘోరవైఫల్యం పొందిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని ఓయూ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి అన్నారు. సింగరాజుపల్లి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం మింగుడు పడక బీఆర్ఎస్ పార్టీ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ధర్నాలు చేస్తుందని అన్నారు. రవీందర్, పురుషోత్తం, రవీందర్, ప్రశాంత్, అమర్నాథ్ రెడ్డి, తాళ్లపెల్లి వేణు పాల్గొన్నారు.

**సంతాపం**

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన భవన నిర్మాణ రంగాల కార్మికుడు పసుల నరేశ్ మృతి బాధాకరమని బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు అన్నారు. మీదికొండకు చెందిన తాపీమేస్త్రీ నరేశ్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా తాటికొండ మధు మంగళవారం గ్రామంలో మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. చింత శ్రీనివాస్, పండుగ రాజు, పొన్నగంటి బాబు, చింత లింగయ్య, మేడ నరేంద్ర, పరమేష్, ఏలియా తదితరులు ఉన్నారు.

**మాతృమూర్తుల మృతి తీరనిలోటు**

దేవరుప్పుల: ఏ ఇంటనైనా మాతృమూర్తుల మృతి ఆ కుటుంబాలకు తీరని లోటని టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అక్షర గార్డెన్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి తల్లి లచ్చమ్మ మృతి చెందగా జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడారు. నెమరుగొమ్ముల వెంగళరావు, అశోక్ రెడ్డి, ప్రభాకర్, రామిరెడ్డి, పృథ్వీరెడ్డి, గణేష్, అనిల్‌కుమార్, మాజీ ఎంపీటీసీ జాకీర్, పాల్గొన్నారు

**సన్మానం**

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ ఫొటోగ్రాఫర్ బొమ్మగాని ప్రదీప్‌ను మంగళవారం ఎస్సై లింగారెడ్డి ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్, వెంకన్న, రాజు, రాజు, లక్ష్మణ్, శ్రీనివాస్ ఉన్నారు.

**బాధిత కుటుంబానికి ఆర్థికసాయం**

కొడకండ్ల: మండలంలోని ఏడునూతుల గ్రామానికి చెందిన రాంపల్లి నిర్మల అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు కీసర సునీల్‌రెడ్డి, ఖలీం, అంజయ్యలు మృతురాలికి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. వెంకన్న, వెంకటయ్య, బుచ్చిరాములు, శ్రీకాంత్, శ్రీకాంత్, సైదులు, సోమన్న ఉన్నారు.

**స్నేహితుడికి..**

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన గుర్రం రవీందర్ ఇటీవల గుండె సర్జరీ చేయించుకుని స్వగ్రామానికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మారపాక రమేశ్ ఆధ్వర్యంలో మంగళవారం రవీందర్‌ను పరామర్శించి రూ. 10 వేల సాయంగా అందజేశారు. బొట్టు వెంకటేష్, బాల్నె శ్రీనివాస్, కుంచల రాజు, భూక్య శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.